క్లుప్తంగా

ఘనంగా సీతారాముల శాంతి కల్యాణం

పామర్రు: స్థానిక తోటలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీసీతారాముల శాంతి కల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గతంలో శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యాక్రమాలు జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో విశేష పూజలను శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయంలో మహాశాంతి, వాస్తు హోమాలను నిర్వహించి, ధ్వజస్తంభానికి సంప్రోక్షణ చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం నిర్వహించారు. ప్రతిష్ఠాపనాచార్యులు పరాశరం రామకృష్ణమాచార్యులు శిష్య బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు వేదాంతం ఠాగూర్ శ్రీనివాస్ ఆలయంలో స్వామివార్లకు విశేషంగా అభిషేకాలు, స్నపన, విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అల్లంశెట్టి సురేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆక్వా రైతుల సమస్యలపై సదస్సు

కైకలూరు: ఆక్వా రైతుల సమస్యలపై ప్రత్యేక సదస్సును గుడివాడ రోడ్డు కేఎస్ఆర్ కాంప్లెక్స్ బీఎస్సార్ ఆక్వా ట్రేడర్స్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్టు బీఎస్సార్ ఆక్వా ట్రేడర్స్ యజమాని బూరుబోయిన శ్రీనివాసరావు శనివారం చెప్పారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి ఆక్వా రైతులు హాజరుకావాలని, తగిన అవగాహన పెంచుకోవాలని కోరారు.

చెత్త తొలగింపు పనుల పరిశీలన



మండవల్లి: ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదేశాల మేరకు మండవల్లి తరుగు మూల సమీపంలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను శనివారం జేసీబీతో తొలగించారు. గుడివాడ- విజయవాడ వైపు రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు అస్తవ్యస్తంగా ఉన్న చెత్త కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో చెత్త తొలగింపు చేపట్టినట్టు సర్పంచ్ మెండా రూనీస్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్ పాల్గొన్నారు.

న్యాయవాది పాండురంగారావుకు నివాళి



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం కమిటీ న్యాయ సలహాదారు, సీనియర్ న్యాయవాది ఎస్వీ పాండురంగారావు సంతాప సభ శనివారం జరిగింది. స్టేడియం కమిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టేడియంకు సంబంధించిన న్యాయపరమైన అంశాలలో ఎన్నో విధాలుగా ఆయన సేవలందించారని వక్తలు పేర్కొన్నారు. ఆయన సేవలను మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో కమిటి ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు(చంటి), సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, కమిటీ సభ్యులు డొప్పలపూడి రవికుమార్, బొగ్గారపు తిరుపతయ్య, వీఎల్‌కేవీ ప్రసాద్, నెరుసు శేషగిరిరావు, చింతా రఘుబాబు, నర్రా రత్నశేఖర్, ఆడిటర్ ఎంఆర్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించండి

కైకలూరు: బడిబయట పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించాలని ఎంఈవో డి.రామారావు, ఎంఈవో-2 వి.శ్రీనివాసరావు కోరారు. కైకలూరు విద్యాశాఖ ఎమ్మార్సీ సమావేశ గదిలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలు, వలంటీర్లకు గ్రాస్ ఎన్‌రోల్‌మెంటు రేషియో (జీఈఆర్)పై సమావేశం శనివారం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశానుసారం 1,300 మంది విద్యార్థులు బడి బయట ఉన్నారని గుర్తించామన్నారు. మండల పరిధిలో జాబితా ప్రకారం వీరిని బడిలో చేర్చాలన్నారు. వీరికి ఆధార్ కార్డులు నమోదు చేసి స్కూల్ చైల్డ్ ఐడీలు ఏర్పాటు చేయాలన్నారు. వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని సమాచారాన్ని సక్రమంగా అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెపల్లెకూ అభివృద్ధి ఫలాలు



ముదినేపల్లి మండలం చిగురుకోటలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు



అల్లూరులో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

- ఎమ్మెల్యే డీఎన్నార్
- సీసీ రోడ్లు, డ్రెయిన్లు ప్రారంభం

ముదినేపల్లి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లెపల్లెకూ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ముదినేపల్లి మండలం చిగురుకోటలో రూ.15 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులు, రూ.7.6 లక్షల మండల పరిషత్ నిధులు, అల్లూరులో రూ.14 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులు, రూ.4 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి పనులు గుర్తించి ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంట సంధ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధ, సర్పంచ్ శీలం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు మోట్రు ఏసు బాబు, జిల్లా వైఎస్సార్ సీపీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బొర్రా శేషుబాబు, ఎంపీటీసీ పేరం నాగలక్ష్మి, మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాబక్షు, రాచూరి కుమార్, దివి సతీష్, రామిశెట్టి అభిలాష్, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ పునఃప్రతిష్ఠ
పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: శ్రీరామనామస్మరణతో అల్లూరు గ్రామం శనివారం మార్మోగింది. తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 లక్షల నిధులు, దాతల సాయంతో గ్రామ ఎస్సీ కాలనీలో రామాలయ పునఃప్రతిష్ఠ, సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్టుకు చెందిన సమరసతా సేవా ఫౌండేషన్ ఈ రామాలయాన్ని నిర్మించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. సీతారాముల జీవిత గాథను అందరూ తెలుసుకోవాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం సేవలను కొనియడారు. అనంతరం యాగశాలలో నిర్వహించిన పూర్ణాహుతిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంట సంధ్య, సర్పంచ్ శీలం రామకృష్ణ, వైస్ ఎంపీపీ రాచూరి రాధ, బీసీ నాయకులు కోమటి విష్ణు, మండల పార్టీ అధ్యక్షుడు మొట్రూ ఏసుబాబు, ఎంపీటీసీ రెడ్డి సతీష్ బాబు, సోమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గులిపల్లి సుధారాణి, నాయకులు కుర్మా మైనర్ బాబు, సాక్షి సాయి బాబు, రాచూరి కుమార్, దివి సతీష్, బేతూ రాజా, పెరుమాళ్ళ రత్న కామేశ్వరరావు, నీలిపల్లి పైడిరాజు, పత్తి సీతారామ్, శీలం వెంకటేశ్వరరావు, దేవస్థానాల ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా మదర్ థెరీసా జయంతి



పామర్రు శరణాలయంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు



గుడివాడలో పండ్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



పామర్రు సచివాలయం-1లో థెరీసా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ కస్తూరి

గుడివాడరూరల్: మదర్ థెరీసా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మదర్ థెరీసా జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి ఎంపీపీ గద్దే పుష్పరాణి మండల పరిషత్ అధికారులతో కలసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే నినాదాన్ని ఆచరించిన మహోన్నతమైన వ్యక్తి మదర్ థెరీసా అన్నారు. నేటి యువత కూడా మదర్ థెరీసా సేవా కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: భారత రత్న మదర్ థెరీసా జయంతి శనివారం పట్టణంలో నిర్వహించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి మాట్లాడారు. సేవకు ప్రతిరూపమైన మదర్ థెరీసా జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రసిడెంట్ పి.వేణుగోపాలరావు, సెక్రటరి బి. సరస్వతి, కోశాధికారి ఎ.గోపిరెడ్డి, డైరక్టర్ దండమూడి సీతారామస్వామి, డాక్టర్ ఇందిరాదేవి, డాక్టర్ సుగుణావతి, డాక్టర్ కృష్ణదొర తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: నిరుపేద ప్రజలకు మదర్ థెరీసా సేవలు ప్రశంసనీయమ గ్రామ సర్పంచ్ కేతావతు కస్తూరి అన్నారు. స్థానిక పామర్రు సచివాలయం-1లో మదర్ థెరీసా జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. థెరీసా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, ఘంటసాల కళా పీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ గ్రామ కార్యదర్శి సలీం పాల్గొన్నారు.

శివరామ కాంప్లెక్స్‌లో..

బాబూ జగ్జీవన్‌రామ్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక శివరామ సినీ థియేటర్ కాంప్లెక్సులో మదర్ థెరీసా జయంతి ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పచ్చిగళ్ల దేవానందరావు థెరీసా చిత్ర పటానికి నివాళులర్పించారు. స్థానిక వాసవీ వృద్ధ శరణాలయంలోని వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు. జువ్వనపూడి సురేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాది ఆవుల ప్రవీణ్‌కుమార్, అరిగెల శివరామ్ (రాజా), రాయవరపు వెంకటేశ్వరరావు, రాజేష్, వెంకటేష్, జంపుల కోటేశ్వరరావు, ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిస్థితులను పరిశీలించండి

గుడివాడ ఆర్డీఓ పద్మావతి



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ పద్మావతి

గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల వివరాలు వాటి స్థితిగతులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ పి. పద్మావతి కోరారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌ల పరిస్థితులు, సౌకర్యాలపై పూర్తి నివేదిక తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండలాల వారీగా ఏఏ ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయి, మండల కేంద్రానికి సుమారు ఎంతదూరంలో ఉన్నాయి, వాటిలో వసతులు, వివరాలు తయారు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు సైతం స్థానికంగా ఉన్న పోలింగ్ బూత్‌ల పరిస్థితులు వాటిలో సమకూర్చాల్సిన అవసరాలను గుర్తించి సంబంధిత తహసీల్దార్‌లకు అందజేయాలని కోరారు. వాటిని పరిశీలించి వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు తహసీల్దార్‌లు కె.ఆంజనేయులు, వి.భవన్నారాయణ, అబ్దుల్ రెహమాన్ మస్తాన్, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో ఎమ్మెల్సీ



సుబ్రహ్మణ్య దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు(కలిదిండి): ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కలిదిండి మండలం కోరుకొల్లు వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చెన్నంశెట్టి కోదండరామయ్య, గ్రామస్తులు అంకెం రాము, చెన్నంశెట్టి ఫణి, చెన్నంశెట్టి మురళీకృష్ణ, శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

సమన్వయ కృషితో సమగ్రాభివృద్ధి

- ఎమ్మెల్యే డీఎన్నార్
- కలిదిండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీపీ చందన

కై కలూరు(కలిదిండి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషిచేస్తే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి మండలం పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా కేటాయించిన నిధులతో సచివాలయ పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్లను పెద్ద ఎత్తున మండలంలో నిర్మిస్తున్నామన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశామన్నారు. కలిదిండి మండలంలో ఎక్కువగా మైక్రోవాటర్ ఫిల్టర్లను మండల పరిషత్ నిధుల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాలువలకు పూర్తి స్థాయిలో తాగునీటి విడుదల చేశారని, అన్ని చెరువులను నింపుకోవాలని సూచించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను ప్రభుత్వం మార్చివేసిందన్నారు. మండల పీహెచ్‌సీలలో ప్రజలకు ఉచిత పరీక్షలు అందుబాటులో ఉండాలన్నారు. అధికారులు శాఖపరంగా అభివృద్ధి పనులను వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, వైఎస్ ఎంపీపీ కూసంపూడి కనకదుర్గారాణి, ఎంపీడీవో జి.రాంబాబు, తహసీల్దారు వంశీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు హాజరయ్యారు.

గుర్రపు డెక్క తొలగించరూ..!



రెడ్డిపాలెం వద్ద చెరువులో అల్లుకున్న గుర్రపుడెక్క

పమిడిముక్కల: మంటాడ శివారు రెడ్డిపాలెం వద్ద ప్రధాన రహదారి పక్కనున్న చెరువు గుర్రపు డెక్కతో నిండి ఉంది. చెరువుకు ఒక వైపు రోడ్డు ఉండగా, మూడు వైపులా ఇళ్లు ఉన్నాయి. చెరువు నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, విషపురుగులు వస్తున్నాయని రెడ్డిపాలెం వాసులు ఆందోళన చెందుతున్నారు. వర్షం వస్తే చెరువులోని నీరు ఇళ్లలోకి చేరుతుందని చెబుతున్నారు. చెరువులోని గుర్రపు డెక్కను తొలగించి, కట్టలను పటిష్టపరచాలని కోరుతున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కైకలూరు: రాజీమార్గం రాజమార్గం వంటిదని, కేసులను జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జి.షణ్ముఖరావు, జూనియర్ సివిల్ జడ్జి బి.శ్రీనివాసులు చెప్పారు. సెప్టెంబరు 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అధాలత్ నిర్వహణపై ముందస్తు సమాచారం నిమిత్తం నియోజకవర్గ స్థాయిలో పోలీసు అధికారులతో కోర్టు ఆవరణలో సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి పోలీసు, న్యాయవాదులు కృషి చేయాలన్నారు. రాజీ చేసుకోదగ్గ కేసులపై ప్రజలకు అవగాహన కల్పించి, ఈ అవకాశం వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్ఐలు రామకృష్ణ, జ్యోతిబసు, ప్రతాప్ రెడ్డి, ప్రియకుమార్, కోర్టు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కైకలూరు: కడుపునొప్పి తాళలేక ఎలుకల మందు తిని చికిత్స పొందుతూ వ్యక్తి శనివారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోనెపాడుకి చెందిన టేకిపూడి ఆనందరావు (27) లారీ డ్రైవర్‌గా పనిచేస్తాడు. అతనికి భార్య ఇరువురు సంతానం. గర్భిణిగా ఉన్న భార్య ఇటీవల పుట్టింటికి వెళ్లింది. ఆనందరావు తరచూ కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం నొప్పి భరించలేక ఎలుకల మందు తిన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆనందరావును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి జీవరత్నం ఫిర్యాదుపై రూరల్ స్టేషన్ హెచ్‌సీ వై.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం



దేవరపల్లిలో పసుపు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి, జెడ్పీటీసీ

తోట్లవల్లూరు: సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఉద్యాన పంటల సాగు ఎంతో లాభదాయకమని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి తెలియజేశారు. మండలంలోని దేవరపల్లిలో ఉద్యాన పంటలను శనివారం ఆమె పరిశీలించారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పసుపు, కంద, అరటి, కూరగాయ పంటల్లో వచ్చే తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణ చర్యలను చేపట్టాలని మంజువాణి సూచించారు. పసుపులో దుంపకుళ్లు, జింకు లోపాన్ని గుర్తించామన్నారు. దుంపకుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క మొదట్లో వేయాలన్నారు. జింకు లోపాన్ని అధిగమించేందుకు రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలని మంజువాణి తెలిపారు. బొప్పాయి, మిరప పంటలలో వైరస్ తెగుళ్లను అధిగమించేందుకు పసుపు, నీలం రంగు జిగురు అట్టలను ఎకరానికి పది చొప్పున పొలంలో అక్కడక్కడ వినియోగించాలన్నారు. బంతిమొక్కలను కూడా నాటవచ్చన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, మండల ఉద్యానశాఖాధికారి చందు జోసఫ్ సుందరం, ఆర్‌బీకే ఇన్‌చార్జి గోపీనాథ్, రైతులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

ఏడీఏ స్వర్ణలత



దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ స్వర్ణలత, ఏవో శివనాగరాణి

పామర్రు: ఎరువులను ప్రైవేట్ డీలర్లు అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని పామర్రు ఏడీఏ స్వర్ణలత అన్నారు. గ్రామంలోని ఎరువులు పురుగుమందుల దుకాణాల్లో స్థానిక వ్యవసాయశాఖ అధికారులతో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పామర్రు మండలంలో యూరియా కొరత లేదని అన్నారు. ఇప్పటి వరకు ఆర్‌బీకేల ద్వారా 600 మెట్రిక్ టనున్నుల యూరియాను విక్రయించామని, ఇంకా 200 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ఇండెంట్‌పెట్టామని, రెండు మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉన్నదన్నారు. మండల పరిధిలోని పామర్రు, జమీగొల్వేపల్లి తదితర ఆర్‌బీకేల వద్ద యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రైవేటు దుకాణాల్లో యూరియాను కూడా కొనుగోలు చేయచ్చన్నారు. ఎరువులు కొనుగోలు చేసే వారు తప్పని సరిగా బిల్లు తీసుకోవాలని అన్నారు. ఎరువులను ఈ పాస్ ద్వారానే అమ్మాలని, రిజిష్టర్స్‌ను ప్రతి రోజూ నిర్వహించాలన్నారు. దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్స్, బిల్ బుక్స్, గూడౌన్‌లలో ఉన్న నిల్వలను తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి శివనాగరాణి, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు నారాయణరెడ్డి

పామర్రు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో సభ్యుడు ఆరేపల్లి బాబూరావు గతంలో మృతి చెందారు. దీంతో పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి నారాయణరెడ్డి మృతుని కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ సంఘంలో సభ్యత్వం ఉన్నవారు మరణిస్తే ఆ కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం సంఘం నుంచి రూ.10 వేలు సాయం అందజేస్తామన్నారు. స్థానిక శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు మృతుని ఇంటికి వెళ్లి మృతుని భార్య నాంచారమ్మకు పది వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, విజయవాడ కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, కార్యదర్శి ఏ శ్రీను, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, సభ్యులు మర్రెడ్డి అంజిరెడ్డి, కూసం పెద వెంకటరెడ్డి, బొమ్మారెడ్డి మాధవరెడ్డి, డి.భాస్కరరెడ్డి, పీఏసీఎస్ మాజీ కార్యదర్శి బి.శేషురెడ్డిలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జొన్నల



జొన్నల రామ్మోహన్‌రెడ్డి

తోట్లవల్లూరు: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని దేవరపల్లికి చెందిన జొన్నల రామ్మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. మండలంలో పార్టీ అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఆయన క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. దేవరపల్లి సర్పంచ్‌గా, మండల పార్టీ అధ్యక్షుడిగా, ప్రస్తుతం తోట్లవల్లూరు జెడ్పీటీసీ సభ్యుడిగా జొన్నల కొనసాగుతున్నారు. తనపై విశ్వాసంతో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, తన నియామకానికి కృషి చేసిన పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌కు రామ్మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజులలో పార్టీ అభివృద్ధికి మరింత పాటుపడతానని ఆయన పేర్కొన్నారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి

జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాసులు



కైకలూరులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాసులు

కైకలూరు: యుక్త వయస్సులోని బాలబాలికలపై తప్పనిసరిగా తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని కైకలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.శ్రీనివాసులు చెప్పారు. మహిళల రక్షణ అనే అంశంపై స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల మహిళలకు బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు బాలికలకు కోర్టులు అందించే రక్షణ చట్టాలను వివరించాలన్నారు. బాలికలు తమపై జరిగే వేధింపులను ధైర్యంగా పోలీసు, కోర్టులకు తెలియజేయవచ్చన్నారు. మహిళా సంరక్షణ కోసం అనేక చట్టాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎంవీవీ.సత్యనారాయణ మహిళా చట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎస్.రాజు, జనరల్ సెక్రెటరీ బందెల లక్ష్మణరావు, జాయింట్ సెక్రెటరీ చావలి శంకర్ శాస్త్రి, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘ మహిళలు పాల్గొన్నారు.